సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 31 | జనవరి | 2023



కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కేనా?
కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏ మేరకు వాటా ఉంటుందనే సంశయం నెలకొంది.
- 8లో▸



మినీ జాతరకు సిద్ధం
మేడారం సమ్మక్క సారలమ్మ మినీజాతరకు అధికారులు సిద్ధమయ్యారు. భక్తుల సౌకర్యార్థం ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
33.9^{0}/16.8^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా పోలీస్ కార్యాలయంలో 'కంటి వెలుగు'



మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య మొదటగా కంటి పరీక్ష చేయించుకున్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులకు కంటిపరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. 250మందికి వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఆర్‌ఐలు నరసయ్య, లాల్‌బాబు, సురేష్, పూర్ణచందర్, డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, యూపీఎస్సీ డాక్టర్ అబ్దుల్, హెచ్‌ఈఓ రామకృష్ణ, కంటి వెలుగు టీం సిబ్బంది ఉమ, మౌనిక, డాక్టర్ కుమార్, అశ్విని, దీన, సిస్టర్లు మమత, మాధవి, యశోద, విజయ, మహేశ్వరి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఇటీవల మిర్చి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అధిక మొత్తంలో మిర్చిని విక్రయించేందుకు సోమవారం తీసుకువచ్చారు. దీంతో వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని 5 షెడ్లు మిర్చి బస్తాలతో నిండిపోయాయి. క్వింటా మిర్చికి గరిష్ట ధర రూ.18,859, కనిష్ట ధర రూ.15,200 పలికిందని ఏఎంసీ సెక్రటరీ జి.రాజేందర్ తెలిపారు. ఈ–నామ్ విధానం ద్వారా మిర్చి కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు.

కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం



తొర్రూరు: కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కొమ్మనపల్లి తండా శివారు కపూర్యాతండాకు చెందిన 25కుటుంబాలు సీపీఎం పార్టీలో చేరాయి. అనంతరం మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో పంచాయతీలుగా ఏర్పడిన తండాల్లో మౌలిక సౌకర్యాలు కరవయ్యాయని తెలిపారు. రవాణా, వైద్య సౌకర్యం మెరుగుపడలేదని, రేషన్ సరుకుల కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి ఉందన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తండాల సమస్యలపై జరిగే పోరాటంలో గిరిజనులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, నాయకులు కొత్త వెంకట్‌రెడ్డి, దర్గయ్య, ధరావత్ యాకన్న, సోమ్లా, వెంకన్న పాల్గొన్నారు.

చదరంగంతో మేధోశక్తికి పదును



తొర్రూరు: చదరంగంతో మేధోశక్తికి పదును లభిస్తుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేష్ అన్నారు. ఇండియన్ స్పోర్ట్స్ నిర్వాహకులు భాస్కర్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి చదరంగం పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్ -9, 11, 13, 15 విభాగాల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, కోఆర్డినేటర్లు లింగమూర్తి, వెంకన్న, ఆర్గనైజర్ వెంకటరమణారావు పాల్గొన్నారు.



జంపన్నవాగు వద్ద పనులను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

వింత ధోరణి


ఉద్యోగ విరమణ సమయంలో ఉపాధ్యాయులకు పదోన్నతి

- అనుకూలమైన ప్రాంతమైతే ఓకే.. లేకుంటే అంతే
- దూరం వెళ్లేందుకు పలువురి విముఖత

సాక్షి, మహబూబాబాద్: సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపడుతోంది. అయితే మూడు దశాబ్దాల క్రితం ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ సమయంలోనైనా పదోన్నతి పొందుతామని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అనుకూలమైన చోటపోస్టింగ్ వస్తే వెళ్తామని, దూరంగా వస్తే వెళ్లేదిలేదని ఉద్యోగ విరమణ దగ్గర ఉన్న ఉపాధ్యాయులు చెబుతున్నారు.

హెచ్‌ఎం పదోన్నతులపై ఉత్కంఠ..

ప్రధానోపాధ్యాయుల పదోన్నతులపై జిల్లాలోని ఉపాధ్యాయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మల్టీజోన్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తారు. ఇలా 19జిల్లాల వ్యాప్తంగా హెచ్‌ఎం పదోన్నతి పొంది, ఆయా జిల్లాల్లో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి వెళ్లాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో 184హెచ్‌ఎం పోస్టులు ఉండగా.. ఇందులో 87మంది పనిచేస్తున్నారు. 97ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా లోకల్‌బాడీ ఉన్నత పాఠశాలల్లో 2,236 పోస్టులు ఉండగా 1,237మంది హెచ్‌ఎంలు పనిచేస్తున్నారు. ఇలా ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లో మొత్తంగా 1,096 ఖాళీలు ఉన్నాయి. ఇందులో మహబూబాబాద్ జిల్లాలో 90 పోస్టులు ఉండగా 51మంది హెచ్‌ఎంలు పనిచేస్తున్నారు. మిగిలిన 39పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. అయితే పదోన్నతుల కోసం మల్టీజోన్ వ్యాప్తంగా కటాఫ్ పెట్టి ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున అంటే 3,288 మంది పదోన్నతులకు అర్హులుగా ప్రకటించి జాబితా తయారు చేశారు. ఇందులో జిల్లా నుంచి ఎంపికైన వారికి మహబూబాబాద్‌లో పోస్టింగ్ ఇవ్వవచ్చు.. లేదా మల్టీజోన్ వ్యాప్తంగా 19జిల్లాల్లో ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు. కాగా ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారిలో అత్యధికంగా జిల్లాను విడిచి వెళ్లేందుకు సిద్ధంగా లేరనే తెలిసింది. దీంతో వారు అనుకూలమైన పాఠశాల వస్తే పదోన్నతిపై వెళ్తారు. లేకుంటే వచ్చిన ఈ అవకాశాన్ని వదులుకుంటారని తెలిసింది.



అదనంగా మరిన్ని పోస్టులు
టీచర్ల బదిలీలు, పదోన్నతుల సందర్భంగా కొందరు ఉపాధ్యాయులు చెక్‌స్లిప్ బదిలీలు అవుతున్నారు. అలాగే 317 జీఓ ద్వారా వచ్చిన స్పౌజ్ ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్తున్నారు. దీంతో ఈ పోస్టులు ఖాళీ అవుతాయి. అదనంగా ఈ పోస్టులను పదోన్నతితో పాటు డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది.

ఎస్‌ఏ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంపై లెక్కలు..

స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టుల పదోన్నతులపై జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్లు లెక్కలు వేసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న ఖాళీల్లో 70శాతం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు ఎస్‌ఏ పోస్టులు, 178 లోకల్ బాడీ పాఠశాలల్లో ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పిస్తారు. వీటిలో సబ్జెక్టుల వారీగా జాబితాను తయారు చేసి సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని తెలిపారు. అయితే ఈ జాబితాలో తప్పులు ఉన్నాయని కొందరు, తమ పేర్లు రాలేదని మరికొందరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేయగా.. డీఈఓ అభ్యంతరాలు స్వీకరించేందుకు అంగీకరించారు. దీంతో ఇప్పటి వరకు 173మంది ఉపాధ్యాయులు తమకు జాబితాలో చోటు దక్కాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే 75మంది, లోకల్ బాడీ పాఠశాలల్లో పనిచేసే 951మందిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు 24మంది, లోకల్ బాడీ ఉపాధ్యాయులు 757మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. 51మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, 174లోకల్ బాడీ ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. కాగా హెచ్‌ఎం ప్రమోషన్ తీసుకునే వారి సంఖ్యను బట్టి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇలా ఒకదానితో ఒకటి సంబంధం ఉండడంతో తమకు ప్రమోషన్ వస్తుందని ఎవరికీ వారు లెక్కలు వేసుకుంటున్నారు.

ఫిబ్రవరిలో పోడు భూముల పట్టాల పంపిణీ

- వీసీలో మంత్రి సత్యవతి రాథోడ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు

మహబూబాబాద్: వచ్చేనెలలో పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని మంత్రులు సత్యవతిరాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి, రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్లతో కంటి వెలుగు, మన ఊరు–మన బడి కార్యక్రమాలు, పోడు భూములకు పట్టాలు, టీచర్ల బదిలీలు, పదోన్నతులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మానుకోట నుంచి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. పోడు భూముల విషయంలో సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. అడవులను సంరక్షిస్తూనే అటవీ చట్టాలకు లోబడి సాగుచేస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులకు పోడు భూముల పట్టాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఫిబ్రవరిలో పట్టాలు అందిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు–మనబడి అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. పోడుభూముల పట్టాల పంపిణీ అనంతరం సెంట్ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. గిరిజనులకు సంబంధించి చట్టం ప్రకారం రెండు ఆధారాలు ఉంటే పట్టాల జారీకి తప్పనిసరిగా ఆమోదించాలన్నారు. కంటి వెలుగు శిబిరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 12,81,774 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2.94లక్షల మందికి రీడింగ్ గ్లాసులు అందజేశామని వెల్లడించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగేవిధంగా కలెక్టర్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలో టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ, ఖాళీల జాబితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు. మెడికల్ బోర్డు ఏర్పాటుచేసి కేసులు పరిశీలిస్తున్నామన్నారు. మన ఊరు– మనబడి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.

బొడ్రాయి మహోత్సవానికి పెద్ద పాలకర్ర సమర్పణ



అబ్బయ్యచారి దంపతులకు సన్మానం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో జరగనున్న బొడ్రాయి పునఃప్రతిష్టాపన మహోత్సవానికి పెద్ద పాలకర్రను దాతలు సోమవారం నిర్వాహకులకు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన వీరంటి అబ్బయ్యచారి–జయలక్ష్మి దంపతులు వారి కుమారులు ప్రశాంత్, అరుణ, వెంకటేష్, కల్యాణి రూ. 2లక్షల విలువ గల అరుదుగా దొరికే పాలకర్రను అందజేశారు. కాగా విశ్వబ్రాహ్మణులు ఆ పాలకర్రకు పూజలు చేశారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో బండోజు ఉపేంద్రాచారి, బొల్లోజు రత్నమాచారి, సత్యవతి, పమ్మి సనా తనచారి, చిన్న, వెంకటేశ్వర్లు, తేలుకుంట్ల ఉపేంద్రాచారి, వెంకటేశ్వర్లు, గుండోజు సుబ్రహ్మణ్యం, సోమయ్య, సుదర్శనాచారి, వెంకటాచారి, హరికృష్ణ, ప్రశాంత్, కృపాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఇటీవల మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల

- 6వ తరగతిలో చేరేందుకు అవకాశం
- ఫిబ్రవరి 15వరకు దరఖాస్తుల గడువు.. ఏప్రిల్ 16న పరీక్ష



మరిపెడలోని మోడల్ స్కూల్

మరిపెడ రూరల్: మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. 2023–24విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 10నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. కాగా ఏప్రిల్ 16న ఉదయం 10నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా 7,8,9,10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4గంటలకు వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.125, జనరల్ విద్యార్థులు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలి.

ఎనిమిది ఆదర్శ పాఠశాలలు..

జిల్లాలో ఎనిమిది ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. డోర్నకల్ మండలం చిలుకోడు, మరిపెడ, కురవి మండలం నేరడ, మహబూబాబాద్ మండలం అనంతారం, తొర్రూరు మండలం గుర్తూరు, కేసముద్రం మండలం కల్వల, నెల్లికుదురు, నర్సింహులపేటలో పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో 100సీట్లు భర్తీ చేస్తారు. అలాగే 7,8,9,10తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే భర్తీ చేయనున్నారు.

వివరాలు ఇలా..

ఈ నెల 10నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ.. ఏప్రిల్ 8నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్.. అదే నెల 16న ప్రవేశ పరీక్ష ఉంటుంది. మే 15న ఫలితాలు వెల్లడించి, సంబంధిత ప్రిన్సిపాల్స్‌కు మెరిట్ జాబితా అందజేస్తారు. మే 24న ఎంపిక విద్యార్థుల జాబితా ఖరారు చేసి అడిషనల్ కలెక్టర్ ఆమోదం పొందుతారు. మే 25 నుంచి 31వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. జూన్ 1వ తేదీ నుంచి నూతన విద్యాసంవత్సరం తరగతుల ప్రారంభమవుతాయి.


పరీక్ష విధానం..

ప్రవేశ పరీక్షలో వంద మార్కులకు వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది. ఆరో తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 7 నుంచి10వ తరగతులకు గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలు, ఇంగ్లిష్ పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం..

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంది. 9,10 తరగతులతో పాటు ఇంటర్ చదువుతున్న 100మందికి మాత్రమే హాస్టల్ వసతి అవకాశం ఉంది. ఇంటి నుంచి మూడు కిలోమీటర్లు ఆపై దూరంలో ఉండేవారు హాస్టల్‌లో ఉండడానికి అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందుతుంది. క్రమశిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.
– పి.రామారావు, డీఈఓ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక
- ప్రజావాణిలో 95వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్ వినతులు స్వీకరించారు. ముందుగా దేశరక్షణలో తమ ప్రాణాలను కోల్పోయిన అమర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అని, అధికారులు ఈ విషయం గుర్తుపెట్టుకుని త్వరగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ వినతులను కూడా త్వరగా పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించకపోతే కారణంతో కూడిన నివేదిక అందజేయాలన్నారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. పనులను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు ఫండ్ ఉంటుందని, వారి విషయంలో ప్రొటోకాల్ సమస్య లేకుండా చూడాలన్నారు. సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కంటి వెలుగు స్పెషల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. కాగా ప్రజావాణిలో 95వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలి



తండాలో సర్వే నంబర్ 60/30లో ఆరు ఎకరాల భూమి ఉంది. వారసత్వంగా వచ్చిన భూమి.. కానీ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం లేదు. ఈ విషయంలో పలుమార్లు కలెక్టరేట్‌లో వినతులు అందజేశా. అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.
– ఇస్లావత్ వసంత్, పెంకుతండా, బయ్యారం

పంట కాల్వను కబ్జా చేశారు



గ్రామంలో కొంతమంది పంట కాల్వను కబ్జా చేశారు. దీంతో సుమారు 80ఎకరాల భూమి పడావుగా ఉంటుంది. రైతులు నష్టపోవాల్సి వస్తోంది. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని కలెక్టరేట్‌లో దరఖాస్తు ఇచ్చాను. పంట కాల్వను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.
– సైదిరెడ్డి, రైతు, కంబాలపల్లి, మహబూబాబాద్

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



బేతోలు గ్రామంలోని 286, 280, 56 సర్వే నంబర్లలో భూదాన్ భూమి ఉంది. దానిలో కొంత భూమిని కబ్జా చేశారు. అలాగే గుట్టలను కొల్లగొట్టి ఎర్రమట్టిని విక్రయిస్తున్నారు. మట్టి దందా, భూకబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.
– బేతోలు గ్రామస్తులు జబ్బార్‌మియా, యూసుఫ్, కుమారస్వామి, బిక్షం, శ్రీను

పార్ట్‌టైం లెక్చరర్లను అప్‌గ్రేడ్ చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న పార్ట్‌టైం లెక్చరర్ల సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: కేయూలో పనిభారంతో విధులు నిర్వర్తిస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్ట్‌టైం లెక్చరర్ల బాధ్యులు సోమవారం క్యాంపస్‌లో పాలక మండలి సభ్యులు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ మదన్‌కుమార్, డాక్టర్ చంద్రమౌళి, ప్రొఫెసర్ మల్లారెడ్డి, సుమతి, ఉమామహేశ్వరి, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావులను సోమవారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బాధ్యులు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న తమను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పాలక మండలి సభ్యులను కలిసిన వారిలో జనరల్ సెక్రటరీ సతీష్‌రాజు, బాధ్యులు కుమార్, మోహన్, సాయికృష్ణ, సమత, శ్యాంసుందర్, మౌనిక, యశోధర, భరత్, వెంకట్, రజనీకాంత్, శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబం

- డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి



జెండా ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగాలు చేశారని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా భరత్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన రాహుల్‌గాంధీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఎన్నో అడ్డంకులు, ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల కోసం పాదయాత్ర చేశారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పెట్టినా ప్రజల ప్రేమ, ఆప్యాయతల ముందు నిలువలేకపోయాయని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ నాయకుడు భూక్యా మురళీనాయక్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంజయ్య, చుక్కల ఉదయ్‌చందర్, సత్యమనోరమ, రామ్మోహన్‌రెడ్డి, నీరుటి లక్ష్మీనారా యణ, చలమల నారాయణ, బానోత్ ప్రసాద్, విజ యలక్ష్మి, స్వర్ణలత, సల్వాది దిలీప్, నరేష్, బెల్లంకొండ శ్రీనివాస్,సుదర్శనాచారి, ఇంద్రారెడ్డి, పద్మం ప్రవీణ్, బానోత్ రమేష్, నర్సింగ శ్రీనివాస్, నీరుటి సురేష్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పోతురాజు రాజు, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



గట్టమ్మ పరిసరాలను పరిశీలిస్తున్న జగదీశ్

ములుగు రూరల్: మినీ మేడారం సందర్భంగా గట్టమ్మ ఆలయం వద్ద భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన గట్టమ్మ ఆలయ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. గట్టమ్మ ఆలయం వద్ద సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.3.50లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా నీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలన్నారు.

మేడారంలో పనుల తనిఖీ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం మినీ జాతర సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఐటీడీఏ పీఓ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జంపన్నవాగు వద్ద దుస్తులు మార్చుకునే గదులు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. జంపన్నవాగు వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈని ఆదేశించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద ఏర్పాట్లు, ఆలయ పరిసరాల్లో లైటింగ్ ఏర్పాట్లు, మేడారం పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మినీ జాతర గురువారం నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా పీఓ అంకిత్ మేడారంలో పర్యటించి ఏ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ వసంతరావు, ఏఓ దామోదరస్వామి, ఎస్‌ఓ రాజ్‌కుమార్ ఉన్నారు.

రామప్పలో సందర్శకుల సందడి



రామప్ప శిల్పాలను పరిశీలిస్తున్న ఉక్రెయినా

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం (ఎం)మండల పరిధిలోని రామప్ప దేవాలయంలో సోమవారం సందర్శకుల సందడి నెలకొంది. ఆస్ట్రేలియా దేశస్తులు కేస్, ఉక్రెయినా, అస్సోం రాష్ట్రానికి చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ జోన్ ప్రెసిడెంట్ జేసీ విధిగుప్తా, డైరెక్టర్ విశ్వేశ్వర్ రావు, జోన్ కోఆర్డినేటర్ సరిత వేరువేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించగా పూజారి హరీశ్ శర్మ వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ వెంకటేశ్ వివరించగా శిల్పకళ సౌందర్యం మరుపురానిదని కొనియాడారు. ఉక్రెయినా భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం చీర ధరించి రామప్పను సందర్శించడం పలువురిని ఆకర్షించింది. జేసీ విధిగుప్తా ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

వీసీ, మాజీ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్‌పై కేసు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య బి.వెంకట్రామ్‌రెడ్డితోసహా ఫైనాన్స్ ఆఫీసర్ టి.రాజయ్యలపై కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో జిల్లాకోర్టు ఆదేశాల మేరకు వారిపైన 418, 425, 405, 406, 408,409 సెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ సోమవారం తెలిపారు. యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు జరిగాయి. అందులో అవకతవకలు జరిగాయని అప్పట్లోనే ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. వారితో కుమ్మక్కై, వారిని ఉద్యోగంలో కొనసాగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలను కూడా చెల్లిస్తున్నారని తమప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని డాక్టర్ వినీత నాయిని జిల్లాకోర్టులో గత ఏడాది సెప్టెంబర్‌లో కేసు వేశారు. దీంతో జిల్లా కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 28న పోలీసులు వీసీ, మాజీ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలంలోని సిరిపురంలో కుక్కల దాడిలో బండ మహేందర్‌కు చెందిన 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రోజువారీగా గొర్రెలను దొడ్లో తోలి మహేందర్ ఇంటికి వెళ్లాడు. రాత్రి కుక్కలు దొడ్లోకి చొరబడి గొర్రెలపై దాడి చేయగా 16 గొర్రెలు చనిపోవడంతోపాటు మరికొన్ని గాయపడి ఉన్నాయి. ఉదయం మహేందర్ వెళ్లి చూసేసరికి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందినట్లు గుర్తించాడు. గాయాలైన గొర్రెలను మండల పశువైద్యాధికారి అనిత పరిశీలించి, వైద్యసేవలు అందించారు. గొర్రెల పెంపకంతోనే జీవనోపాధి పొందే మహేందర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


శ్రీను (ఫైల్)

పెద్దవంగర: కడుపు నొప్పి తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎస్కే రియాజ్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల పరిధిలోని రామచంద్రు దండాకు చెందిన లకావత్ శ్రీను (38) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం పలుమార్లు ఆస్పత్రులు తిరిగినా కడుపు నొప్పి తగ్గకపోవడంతో మనస్థాపానికి లోనై ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనుకు భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి బాల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు తండావాసి జాటోతు శ్రీనివాస్ రూ.5 వేలు ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేశాడు.

గుర్తుతెలియని వ్యక్తి..

కమలాపూర్: కమలాపూర్ మండలంలోని ఉప్పల్–జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు మంచిర్యాల జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందని, మృతుడి వద్ద ఎలాంటి అడ్రస్, ఆధారాలు లేవని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు చుక్కల షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మెడకు నల్లని దారం, ఆంజనేయుని బొమ్మగల మెటల్ లాకెట్, కుడి చేతికి తెలుపు రంగు ఉంగరం, కుడి చేతిపై ఏ అనే పచ్చబొట్టు ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. ఈ సమాచారాన్ని మృతుడి బంధువులకు చేరే వరకు వాట్సాప్ గ్రూపుల్లో పంపించాలని, పూర్తి వివరాలకు 83285 12176, 94409 00792 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కేనా!



గత బడ్జెట్‌లలో కేటాయింపులు తక్కువే..
- కలగానే కాజీపేట డివిజన్..
- పెండింగ్‌లో కాజీపేట–సికింద్రాబాద్ మూడోలైన్
- ఈసారి బడ్జెట్‌పై ప్రజల ఆశలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: కేంద్ర బడ్జెట్ కోసం ప్రతీసారి చేస్తున్న ప్రతిపాదనలకు మోక్షం లభించకపోవడంతో కీలకమైన ప్రాజెక్టుల పనులు పట్టాలెక్కడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఎంపీల ప్రతిపాదనలకు ఫలితం ఉంటుందా.. అనే చర్చ జరుగుతోంది. రేపు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే పెద్ద పద్దులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏమేరకు వాటా ఉంటుందనే సంశయం నెలకొంది. మూడు బడ్జెట్‌ల సమయంలో ప్రతిపాదనలు చేసినా.. కాళేశ్వరానికి జాతీయ హోదా దక్కకపోగా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్, పీఓహెచ్ షెడ్‌కు స్థల కేటాయింపు, కొత్త రైల్వేలైన్ల ప్రతిపాదనలు, సర్వేలు కాగితాలకే పరిమితమయ్యాయి. 2023–24 బడ్జెట్‌లోనైనా సరిపడా నిధులు కేటాయిస్తారని ఓరుగల్లు వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్‌లో కీలక ప్రాజెక్టులు

పెండింగ్ రైల్వే లైన్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు ఇవ్వలేదు. కాజీపేట మీదుగా బల్లార్షా– విజయవాడ మూడో లైన్ నిర్మాణ పనులు మాత్రమే జరుగుతుండగా, కాజీపేట డివిజన్ కేంద్రం ఏర్పాటు, బల్లార్షా– కాజీపేట ఫోర్త్ లైన్ నిర్మాణం పెండింగ్‌లో ఉన్నాయి. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు మూడో రైల్వేలైన్ సర్వే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. కాజీపేట– హసన్‌పర్తి –హుజూరాబాద్ – కరీంనగర్ కొత్త రైల్వేలైన్.. సర్వే ప్రతిపాదనలు దాటలేదు. కొత్తగూడెం, మణుగూరు నుంచి తాడ్వాయి అడవుల మీదుగా రామగుండం, భూపాలపల్లికి రెండు మార్గాల్లో సర్వే కోసం గతంలో బడ్జెట్‌లో ప్రతిపాదనలు రాగా ప్రైవేటు సంస్థతో సర్వేతో సరిపెట్టారు. కాగా, మన ఎంపీలు పలుమార్లు చేసిన ప్రతిపాదనలు కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనకు నోచుకోలేదు. గ్రేటర్ వరంగల్‌కు 2016మే నాలుగో వారంలో సప్లమెంటరీ పోటీల్లో 'స్మార్ట్‌సిటీ'లో చోటు లభించింది. ఈ పథకంలో రూ.2వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులను ప్రతిపాదించారు. 2021–22 బడ్జెట్‌లో రూ.160 కోట్లు కేటాయించి విడుదల చేయగా, 2022–23 బడ్జెట్‌లో ప్రత్యేకంగా పేర్కొన లేదు. హృదయ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం గత ఆరేళ్ల కిందట కేటాయించిన రూ.40 కోట్లతో వివిధ పనులు చేపట్టగా, గత బడ్జెట్‌లో ఇచ్చిందేమీ లేదు. గ్రేటర్ వరంగల్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా)లకు వాటా దక్కలేదు.

పీఓహెచ్‌కు రూ.900 కోట్ల అంచనా..

పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ షెడ్ (పీఓహెచ్) కాజీపేట అయోధ్యపురంలో నిర్మించేందుకు కేంద్రం రూ.900 కోట్లతో అంచనా వేసింది. వ్యాగన్ రిపేర్ షెడ్ల నిర్మాణానికి ఎకరంన్నర స్థల సమస్య కారణంగా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. పీఓహెచ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని దేవాదాయశాఖ నుంచి సేకరించి కేంద్రానికి అప్పగించగా, ముఖద్వారం వద్ద ఉన్న ఎకరంన్నర భూమి సేకరణలో జాప్యం పనులకు అడ్డంకిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థల పూర్తి చేస్తే కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది. గత బడ్జెట్‌లో కాజీపేట రైల్వేస్టేషన్‌లో రెండు అదనపు ఫ్లాట్‌ఫారాల మంజూరు చేసినట్లు ప్రకటించినా నేటికీ ఆ పనుల్లో కదలిక లేదు. కాగా కరోనా సమయంలో డోర్నకల్, గార్ల, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలన్న డిమాండ్ ఉంది. పాండురంగాపురం భద్రాచలం రైల్వే లైన్లను ప్రారంభించి, రైల్వే బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి నిధులు అడిగాం..



గిరిజనులు ఆదివాసీలు ఎక్కువగా ఉన్న మానుకోట పార్లమెంట్ పరిధి అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరాను. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించి ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నాం. మా పార్లమెంటు పరిధిలోని ప్రతి జిల్లాలో ఏకలవ్య స్కూల్ ఏర్పాటు చేయాలి.

– మాలోతు కవిత, ఎంపీ, మహబూబాబాద్

ప్రతిపాదనలు పంపించాను..



కేంద్ర బడ్జెట్ సందర్భంగా పలు ప్రతిపాదనలు చేశాం. గిరిజన యూనివర్సిటీతో పాటు నవో దయ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని అడిగా. కాజీపేట డివిజన్, పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమ, రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు కావాలి. కాజీపేట నుంచి తిరుపతికి, షిర్డీకి కొత్త రైళ్లను వేయాలని కోరాం.

– పసునూరి దయాకర్, ఎంపీ, వరంగల్

కీలక ప్రతిపాదనలు చేశా..



ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు చేశాను. కాజీపేట– హసన్‌పర్తి – హుజూరాబాద్ – కరీంనగర్ మార్గం ఏర్పాటు విషయమై విన్నవించా. ఈ బడ్జెట్‌లోనూ రైల్వే ప్రాజెక్ట్‌ల పరంగా మంచి నిర్ణయాలుంటాయని భావిస్తున్నా.

– బండి సంజయ్, ఎంపీ, కరీంనగర్


మొదటి మ్యాచ్ విజేత సీడీసీ జట్టు


రెండో మ్యాచ్ విజేత వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ

రసవత్తరంగా సాక్షి ప్రీమియర్ లీగ్

- క్రికెట్ పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సాగిన క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, డీహెచ్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. పోటీలకు ఎల్బీ కళాశాల మైదానం వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు.

- మూడో రోజు మొదటి మ్యాచ్‌లో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ– నేతాజీ ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. చైతన్య యూనివర్సిటీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. నేతాజీ ఫార్మసీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 66 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చైతన్య యూనివర్సిటీ జట్టు 7.3 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. ఈ మ్యాచ్‌లో నిఖిల్ 40 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచాడు.
- రెండో మ్యాచ్‌లో ఎల్బీ కళాశాల– సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెయింట్ పీటర్స్ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 54 పరుగులు సాధించింది. ఎల్బీ కళాశాల జట్టు 3.4 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించి అదరహో అనిపించింది. ఈ మ్యాచ్‌లో హరిప్రసాద్ 23 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచాడు.
- మూడో మ్యాచ్‌లో వాగ్దేవి కళాశాల– అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 157 పరుగులు సాధించింది. ఆయుర్వేద కళాశాల జట్టు 10 ఓవర్లలో 40 పరుగులు మాత్రమే సాధించగలిగింది. దీంతో వాగ్దేవి జట్టు 117 పరుగుల భారీ తేడాతో విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో వాగ్దేవి కళాశాలకు చెందిన అబ్దుల్ వాసీ 63 పరుగులతో మైదానంలో మెరుపులు మెరిపించాడు.
- నాల్గో మ్యాచ్‌లో జయముఖి కళాశాల, శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జయముఖి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 141 పరుగులు సాధించింది. అరుణోదయ జట్టు 5 ఓవర్లలో 44 పరుగులకే ఆల్ అవుట్ అయింది. దీంతో జయముఖి కళాశాల 103 పరుగులతో భారీ విజయాన్ని సాధించింది.


మూడో మ్యాచ్ విజేత ఎల్బీ కాలేజీ జట్టు


నాల్గో మ్యాచ్ విజేత జయముఖి కాలేజీ జట్టు

పోక్సో కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ గిరికుమార్

ఖిలా వరంగల్: మాయమాటలతో నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి బాలికపై సామూహిక అత్యాచారం చేసి పరారీలోఉన్న ముగ్గురు యువకులను పోక్సో కేసులో సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ కల్కోట్ల గిరికుమార్ తెలిపారు. సోమవారం వరంగల్ మట్టెవాడ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ వివరాలు వెల్లడించారు. కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ 16ఏళ్ల బాలికకు ఓ స్నేహితురాలి ద్వారా నర్సంపేటలోని మాధన్నపేట గ్రామానికి చెందిన దూడల ప్రభాస్(19) పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో ఆ బాలికకు దగ్గరై లైంగిక దాడికి ఒడిగడుతున్నాడు. ఈక్రమంలో బాలికను ఈనెల 24న ఇంటి నుంచి బయటకు రప్పించి బైక్‌పై దూపకుంట రోడ్డులోని నిర్జీవ ప్రదేశానికి దూడల ప్రభాస్ తీసుకెళ్లాడు. అతని స్నేహితులు సమీప బంధువులు పడమరకోట ఎస్సీ కాలనీకి చెందిన గద్దల భరత్(22), అదే ప్రాంతానికి చెందిన మైదం అవినాష్ ఆలియాస్ బన్నీ(19)లు కలిసి బాలికపై అత్యాచారానికి పాల్పడుతారు. ఆతర్వాత బాలికను మాధన్నపేటలోని తన ఇంటికి తీసుకెళ్లి అక్కడి నుంచి నేరుగా కాశిబుగ్గలోని తన ఇంటి వద్ద వదిలేశాడు. జరిగిన ఘటనపై ఈనెల 25వ తేదీ బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో తల్లి సహకారంతో బాధిత బాలిక ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు కామాంధులు దూడల ప్రభాస్, గద్దల భరత్, మైదం అవినాష్ ఆలియాస్ బన్నిలను సోమవారం ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరచగా జడ్జీ ఆదేశాల మేరకు ఖమ్మం జైలుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

ఐదుగురిపై చీటింగ్ కేసు నమోదు


ఖిలా వరంగల్: తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖిలా వరంగల్: వాహనానికి నంబర్ ప్లేట్స్, ట్యాంపరింగ్, నంబర్ ప్లేట్ మీద స్టిక్కర్ వేసి తిరుగుతున్న ఐదురుగు వాహనచోదకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. ఈమేరకు సోమవారం వరంగల్ శంభునిపేటలోని గవిచర్ల క్రాస్ రోడ్డుపై ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో ఎస్సై రాజబాబు, ఆర్ఎస్సైలు పూర్ణచందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో టేకు శ్రీకాంత్, కందిక సురేష్, మార్త మాధవ్, ముప్ప చరణ్ నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారి వాహనాలను సీజ్ చేసి, వారిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో 420 చీటింగ్ కేసు నమోదు చేయించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

కాజీపేట: కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష, 8 మందికి రూ.14వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి విద్యాసాగర్ రావు తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. గుమ్మడి భద్రయ్య, మండ తిరుపతి, రావుల నీలాధర్, మాచర్ల రాజేందర్‌లకు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

మేడారంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన డ్రెస్సింగ్ గదులు, ట్యాప్స్, గద్దెల ప్రాంగణంలో సీసీ కెమెరా







మినీ జాతరకు సిద్ధం

మేడారంలో ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- విధుల నిర్వహణకు అధికారుల సన్నద్ధం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ మినీజాతరకు అధికారులు సిద్ధమయ్యారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం ఆయా శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మినీజాతర (మండమెలిగె) ఉత్సవాలు ప్రారంభయ్యే నేపథ్యంలో జాతరలో విధుల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సంసిద్ధులవుతున్నారు. ఈ జాతరకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా మేరకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. జాతరకు ఒకే రోజు మాత్రమే గడువు ఉంది.

పూర్తయిన ఏర్పాట్లు..

మినీజాతరలో భక్తుల సౌకర్యార్థం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో మేడారంలో 600 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం సోమవారం నాటికి పూర్తయింది. జాతరలో భక్తుల మల,మూత్ర విసర్జన కోసం సులభ్ కాంప్లెక్స్ మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు వద్ద శాశ్వతంగా నిర్మించిన మూడు డ్రెసింగ్ గదుల్లో ఎలక్ట్రీషియన్ పనులన్నీ పూర్తయ్యాయి. జంప్నవాగు వద్ద జల్లు స్నానాలకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌లకు కనెక్షన్ ఏర్పాటు చేశారు పోలీసు శాఖ ఆధ్వర్యంలో భక్తుల వాహనాలు మళ్లించేందుకు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు.


అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లు

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటిని భక్తులకు అందించేందుకు భక్తులు విడిది చేసే ప్రదేశాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేసి వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి కనెక్షన్ అందించారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మేడారంలో భక్తులకు అందించే సౌకర్యాలకు వారికి తెలిసే విధంగా మేడారంలోని ప్రధాన దారుల వెంట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు క్యూలో భక్తులు అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, ఈఓ రాజేంద్రం దేవాదాయ శాఖ పనులన్నీ పూర్తయ్యాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవార్లను దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత మేడారంలో పర్యటించి ఆ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన పనులను పరిశీలించారు. సులభ్ కాంప్లెక్స్ మరమ్మతులు, జంపన్నవాగు వద్ద డ్రెస్సింగ్ గదుల్లో ఎలక్ట్రీషియన్ పనులను పరిశీలించారు. నేటి నుంచి తమ శాఖ తరఫున చేపట్టిన సౌకర్యాలన్నీ భక్తులకు అందుబాటులోకి తీసురానున్నట్లు తెలిపారు.

భక్తుల మొక్కులు

సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించి పుట్టు వెంట్రుకలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. అమ్మవార్ల పసుపు, కుంకుమ, ఒడి బియ్యం ఎత్తు బంగారం సమర్పించారు. మొక్కుల అనంతరం మేడారం పరిసరాల్లో సేదతీరి వంట వార్పు చేసుకున్నారు.


అమ్మవార్లకు ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రోడ్డుపై పడిన కరెన్సీ

- జనం నుంచి రికవరీ చేసిన పోలీసులు
- వర్ధన్నపేటలో వింత ఘటన


డబ్బులు లభించిన వ్యక్తి

వర్ధన్నపేట: ద్విచక్ర వాహనం నుంచి పొరపాటున రోడ్డుపై పడిపోయిన కరెన్సీని దొరికినవి దొరికినట్లుగా ఏరుకుని తీసుకున్న వారి సమాచారం కనుగొని పోలీసులు వారి నుంచి రికవరీ చేసిన ఘటన సోమవారం సాయంత్రం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపునకు వెళుతున్న ఓ ద్విచక్రవాహనంపై ఓ జంట ప్రయాణిస్తుండగా వర్ధన్నపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ కవరులోంచి రూ.500 నోట్లు కింద పడ్డాయి. ఆ విషయాన్ని వారు గమనించలేదు. కింద పడ్డ నోట్లను కొందరు ఏరుకోగా ఓ వ్యక్తికి రూ.6,500, మరో వ్యక్తికి రూ.2,000, మరో గుర్తు తెలియని వ్యక్తికి రూ.3,000 వేలు లభించాయి. ఈ విషయం సోషల్‌మీడియాలో ప్రచారం కావడం పోలీసులకు సమాచారం అందడంతో వారు డబ్బులను తీసుకున్న వారిని గుర్తించి రాత్రి వారి నుంచి రూ.7వేలు రికవరీ చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. మిగతా డబ్బులు తీసుకున్న వ్యక్తి బీహార్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఉన్నట్లుగా సమాచారం ఉందన్నారు. వ్యక్తి దొరకలేదని వివరించారు.

నిలిచిఉన్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన మరో బస్సు

- నలుగురు ప్రయాణికులకు గాయాలు




గాయపడిన రాజేశ్వరి, వివేక్

రఘునాథపల్లి: నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండ నుంచి తిరిగి వస్తూ మండల కేంద్రంలో సర్వీస్‌రోడ్డులోని రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద ప్రయాణికుల కోసం నిలిచిఉంది. అదే సమయంలో హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనకాల వస్తూ నిలిచి ఉన్న బస్సును ఢీ కొట్టింది. దీంతో ముందు ఉన్న బస్సు అద్దాలు పగిలి వెనకాల కూర్చున్న మంగళిబండతండాకు చెందిన సునావత్ వివేక్, జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన రాజేశ్వరితో పాటు మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని గాయపడినవారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన హనుమకొండ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ గుగులోతు రాములుపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

వరంగల్ క్రైం: ఐనవోలు దేవాలయం పరిసర ప్రాంతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగతో పాటు, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులను ఐనవోలు పోలీసులు సోమవారం అరెస్ట్ చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. నిందితుల నుంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.80 లక్షల నగదు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి ప్రాంతానికి చెందిన నిందితుడు ఎల్లబోయిన హరీష్ ఈనెల 21న యాదాద్రి జిల్లా బీబీనగర్ ప్రాంతానికి చెందిన గండు వసంత మొక్కులు చెల్లించుకునేందుకు ఐనవోలు జాతరలోని ఎల్లమ్మ గుడి వద్ద బోనం ఎత్తుకొనే సమయంలో సదరు మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును చోరీ చేశాడు. ఈ చోరీ పై బాధితులరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఐనవోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జాతరలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి కాశిబుగ్గ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు చైన్ స్నాచింగ్ చేసిన అనంతరం వంచనగిరి చెందిన మరో నిందితుడు శోబోతు భిక్షపతి సూచన మేరకు అతనితో కలిసి బంగారు పుస్తెల తాడుని నెక్కొండ మండలం అలంకారిపేట గ్రామానికి చెందిన బోయినపల్లి సూర్యప్రకాశ్‌కి విక్రయించగా.. ఇందుకుగాను నిందితులకు రూ.2.06 లక్షలు ఇచ్చాడు. ఇందులో ప్రధాన నిందితుడు హరీశ్ రూ.1.80 ఉంచుకోగా మిగతా ఇరవై వేలను మరో నిందితుడు భిక్షపతికి ఇచ్చినట్లు ప్రధాన నిందితుడు అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుడి సమాచారం మేరకు మిగతా ఇద్దరు నిందితుల వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు నగదు, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏసీపీ నరేష్‌కుమార్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై వెంకన్న, సిబ్బందిని డీసీపీ అభినందించారు.